యాదగిరీశుడికి వైభవంగా దర్బార్ సేవోత్సవం

యాదగిరిగుట్ట, అక్టోబర్ 10 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామికి దర్బార్ సేవోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి సేవోత్సవాన్ని నిర్వహించారు. నాలుగు వేదాలు స్వామివారికి పారాయణం చేసి, స్వామివారిని స్వస్తిమంత్రార్థ వంటి మంత్రాలతో శాంతింపజేశారు. నక్షత్ర హారతి ఇచ్చి స్వామివారిని కొలిచారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో కల్యాణోత్సవ సేవను ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. అనంతరం లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్య కల్యాణ తంతు నిర్వహించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.13,40,391 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

12న శమిపూజ

లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 12న సాయంత్రం 5.30 గంటలకు శమి పూజ నిర్వహించనున్నారు. ప్రధానాలయంలోని తూర్పు రాజగోపురం ముందు ప్రాంతంలో పూజ వేడుక పాంచరాత్రగమశాస్త్రానుసారం ఘనంగా చేపట్టనున్నట్లు ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు.

విమాన గోపురం స్వర్ణతాపడానికి 12కిలోల బంగారం

- స్మార్ట్ క్రియేషన్ సంస్థకు అప్పగింత

యాదగిరిగుట్ట, అక్టోబర్ 10 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయ విమాన గోపురం స్వర్ణతాపడం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సుమారు 11 టన్నుల రాగిని వినియోగించి సిద్ధం చేసిన విమాన గోపురం తొడుగులను మూడు ప్రత్యేక వాహనాల ద్వారా చెన్నై స్మార్ట్ క్రియేషన్ సంస్థకు అందజేసిన దేవస్థానం.. గురువారం ఇందుకు సంబంధించిన బంగారాన్ని అప్పగించారు. 12కిలోల మేలిమి బిస్కట్ బంగారాన్ని ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వయంగా వెళ్లి స్మార్ట్ క్రియేషన్ సంస్థకు అందజేశారు. తాజాగా అప్పగించిన బంగారంతో బంగారు తాపడం పనులను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొత్తం 60 కిలోల బంగారాన్ని వినియోగించనున్నామని, ఇందులో 12 కిలోలు అందజేయగా, మిగతా 48 కిలోల బంగారాన్ని విడుతల వారీగా అందజేస్తామని అన్నారు. వచ్చే వార్షిక బ్రహ్మోత్సవాల్లోపు స్వామివారి విమాన గోపురం స్వర్ణమయం చేస్తామని తెలిపారు.



స్మార్ట్ క్రియేషన్ సంస్థ వారికి బంగారాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

దుర్గాదేవి అలంకారంలో ఉన్న పర్వతవర్ధినీ అమ్మవారికి అర్చన చేస్తున్న అర్చకుడు

దుర్గాదేవిగా అమ్మవారు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 10 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. గురువారం 8వ రోజు అమ్మవారికి ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణాలు, గాయత్రీ జపాలు, లలితా సహస్రనామార్చనలు నిర్వహించారు. దుర్గాష్టమి సందర్భంగా విశేషంగా చండీ హవనం చేపట్టారు. మధ్యాహ్నం పూజ, నీరాజన మంత్రపుష్పాలు జరిగాయి. సాయంత్రం దేవి నవావరణ పూజ, సహస్రనామార్చన నీరాజనం మంత్రపుష్పాలు, దుర్గా స్వరూప సువాసినీ పూజ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. పర్వతవర్ధినీ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

స్వర్ణగిరిలో ధైర్యలక్ష్మి స్వరూపంలో అమ్మవారు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరి క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం పద్మావతి అమ్మవారు ధైర్యలక్ష్మి స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు హవనం నిర్వహించారు. అనంతరం మంగళహారతులు సమర్పించారు. సాయంత్రం అమ్మవారు మాఢవీధుల్లో విహరించారు. నిత్యారాధనల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రోపృష్ట దర్శనాన్ని చేయించారు. వేద మంత్రాలతో సువర్ణ బిందె తీర్థాన్ని బంగారపు బావి నుంచి తీసుకొచ్చారు. వేంకటేశ్వరస్వామికి అర్చకులు రంగురంగుల పుష్పమాలలతో తోమాల సేవను నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర నామార్చన జరిపారు. పద్మావతి అమ్మవారిని ఆలయంలోని లక్ష్మీ మంటపంలో కొలువుదీర్చి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. వేంకటేశ్వర స్వామికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. స్వామివారికి 450 కిలోల అన్న ప్రసాదాన్ని, పులిహోరం, లడ్డూ, వడ తదితర వంటలతో నివేదన చేశారు. పద్మావతీ, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామికి నిత్య కల్యాణ మహోత్సవం దేదీప్యమానంగా నిర్వహించారు. సుమారు 4200 మందికి పైగా భక్తులకు నిత్యాన్న ప్రసాదాన్ని అందించారు.

ఉత్సవమూర్తికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పూర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో చోరీ

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 10 : మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలోని స్వయంభూ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు హుండీ దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయ పూజారి పవన్‌కుమారశర్మ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీని పగులగొట్టి అందులోని నగదుతోపాటు బీరువాలోని వస్తువులను చిందర వందర చేశారు. ఆలయ హుండీని నెల రోజుల నుంచి తెరవలేదని, అందులో రూ.50వేలకు పైగా నగదు ఉంటుందని తెలిపారు. ఈ ఆలయంలో గతంలో సైతం పలు మార్లు దొంగతనాలు జరిగాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఆలయంలో పరిశీలించి ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

'సనాతన ధర్మానికి ఆలంబనం రమణేశ్వర క్షేత్రం'

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 10 : సనాతన ధర్మానికి ఆలంబనం రమణేశ్వర క్షేత్రమని, 9అడుగుల పంచలోహ శ్రీచక్ర ప్రతిష్ఠతో నూతన అధ్యాయానికి నాంది పలికామని సిద్ధగురు రమణానందమహర్షి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని శివ శక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో శ్రీచక్రాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీచక్రాలకు పూజా కార్యక్రమాలు చేపట్టి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 9అడుగుల పంచలోహ శ్రీచక్రాన్ని బాలాత్రిపురసుందరి అమ్మవారి పేరుపై ప్రతిష్ఠ మహోత్సవాలను చేపట్టడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో రమణేశ్వరం ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందుతుందని అన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

పంచలోహ శ్రీచక్ర ప్రతిష్ఠ చేపడుతున్న రమణానంద మహర్షి

భువనగిరిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామంలో బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు

ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆలేరు టౌన్, అక్టోబర్ 10 : ప్రకృతి, పూలను పూజించే పండుగ బతుకమ్మ అని, తెలంగాణలో ఆడబిడ్డలు తీరొక్క పూలను పేర్చి గౌరమ్మను పూజిస్తారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఆలేరులోని పెద్ద వాగు సమీపంలో గురువారం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అంతకుముందు సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని సాయిగూడెంలో బతుకమ్మ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ హయాంలో 10 సంవత్సరాలుగా బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారన్నారు. ఈ సారి ఆడబిడ్డలకు కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరెలు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. అనంతరం కనకదుర్గ ఆలయంలో పూజలు చేశారు.

ఊరూరా సద్దుల సంబురం

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్ : సద్దుల బతుకమ్మ వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. వాడవాడనా సంబురాలు నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, చెరువుల వద్ద ఉంచి ఆడిపాడారు. అనంతరం చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మనిర్వహించారు. కొండపైన తూర్పు రాజగోపురం ఎదురుగా బతుకమ్మలను ఉంచి మహిళలు ఆడిపాడారు.

ఆలేరు టౌన్ : మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

వలిగొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

గుండాల మండలం సుద్దాలలో..

భువనగిరిలో..

చౌటుప్పల్ పట్టణంలో..

మోటకొండూర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ శ్రీలత

బొమ్మలరామారం : మర్యాలలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు

బీబీనగర్ : గండమ్మ గుడి ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భూదాన్ పోచంపల్లిలో..

ఆత్మకూరు(ఎం) : బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు

రామన్నపేట మండలం సిరిపురంలో..

మోత్కూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చౌటుప్పల్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజు

భువనగిరిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

- ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు భూ నిర్వాసితుల వినతి

చౌటుప్పల్, అక్టోబర్ 11 : చౌటుప్పల్, రాయగిరి, గజ్వేల్ ప్రాంతాల్లో రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని ఆయా ప్రాంతాల భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎన్‌హెచ్‌ఏఐ రీజినల్ ఆఫీసర్ పి.శివశంకర్, గజ్వేల్ పీడీ ఎం.మాధవికి ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని వారి కార్యాలయాల్లో కలిసి వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఓఆర్‌ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు నాలుగు రహదారులను 40కిలోమీటర్ల దూరంలో జంక్షన్లు ఏర్పాటు చేశారన్నారు. చౌటుప్పల్, భువనగిరి ప్రాంతాల్లో కేవలం 28కిలోమీటర్ల దూరంలో నిర్మిస్తున్నారని తెలిపారు. చౌటుప్పల్ జంక్షన్ ఏర్పాటు వల్ల మున్సిపాలిటీ రెండుగా విడిపోతుందని వివరించారు. దీంతోపాటు ఏటా మూడు పంటలు పండే భూములు, హెచ్‌ఎండీఏ ప్లాట్లలోని ఇండ్లు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం తక్షణమే సవరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఏఐ రీజినల్ ఆఫీసర్ శివశంకర్‌కు ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి వినతి పత్రం ఇస్తున్న భూ నిర్వాసితులు

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, అక్టోబర్ 10 : ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుర్రాలదండి గ్రామానికి చెందిన కాటపల్లి రాములమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.5 లక్షల ఎల్ఓసీని రాములమ్మ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటానని, వారి సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం రామునిగుండ్ల తండా పరిధిలోని గన్నెగానితండా నుంచి కొక్యాతండా వరకు 500 ఫీట్ల సీసీ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ బానోతు గోపీనాయక్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

పేకాడుతున్న ఆరుగురు అరెస్ట్

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 10 : పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ పోలీసులు బుధవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఎల్లమ్మ టెంపుల్ వద్ద ఫంక్షన్ హాళ్లను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఓ ఫంక్షన్ హాల్‌లో పేకాడుతున్న పాండు, మల్లేశ్, ప్రశాంత్, వెంకటేశ్, లక్ష్మణ్, నర్సింగ్‌రావును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 23,610 రూపాయల నగదు, 5 మొబైల్ ఫోన్లు, 2 సెట్ల పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ఎస్ఐ సంతోష్‌కుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు

రోడ్డు పనుల పరిశీలన

మోత్కూరు : మున్సిపాలిటీలో ప్రధాన రోడ్డు వెంట చేపట్టిన డ్రైనేజీ, రోడ్డు పనులను, అమృత్ 2.0 కింద చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణాలను పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి, కమిషనర్ శ్రీక్రాంత్, డీఈఈ మనోహర, ఏఈ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ఏసీపీ రమేశ్‌కుమార్

యాదగిరిగుట్ట, అక్టోబర్ 10 : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని యాదగిరిగుట్ట ఏసీపీ రమేశ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని యువకులకు గురువారం సైబర్, వివిధ రకాల నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ప్రజలు, యువకులకు నేరాలపై అవగాహన కల్పిస్తూ పోలీసులు, ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి దేశ నలుమూలల నుంచి ఎంతో మంది భక్తులు వస్తుంటారని, వారికి ఇబ్బందులకు కలుగకుండా చూడాల్సిన బాధ్యత పట్టణ ప్రజలపై ఉందని అన్నారు. మహిళలను వేధింపులకు గురిచేస్తే సహించేది లేదని, గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల రక్షణకు షీ టీమ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఏమైనా ఆపద వస్తే డయల్ 100, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రమేశ్, ఎస్ఐ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రమేశ్‌కుమార్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఆలేరు టౌన్, అక్టోబర్ 10 : మున్సిపాలిటీలోని 6వ వార్డులో ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్ ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్ రాయపురం నరసింహులు, మాజీ సర్పంచ్ కూళ్ల నరసింహులు, నాయకులు శ్రీనివాస్, ఆంజనేయులు, సిద్ధిమల్లయ్య, యాదగిరి, భిక్షపతి, జహంగీర్, శ్రీకాంత్, పాండు పాల్గొన్నారు.

మునుగోడును అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 10 : మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి పరుగులు పెట్టిస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని సర్వేల్ గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 64 డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించగా.. 60 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. మిగిలిన నాలుగు ఇండ్ల పట్టాలను గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కరంటోతు శ్రీను, నాయకులు దోనూరి జైపాల్‌రెడ్డి, సతీశ్, శేఖర్‌రెడ్డి, స్వామి, రాజు, శంకర్‌రెడ్డి, యాదయ్య, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

రేషన్ బియ్యం పట్టివేత

తుర్కపల్లి, అక్టోబర్ 10 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తుర్కపల్లి పోలీసులు గురువారం పట్టుకున్నారు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ తకియొద్దీన్ ఆధ్వర్యంలో మండలంలోని ముల్కపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా టాటా ఇన్‌ట్రా వాహనంలో 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా తరలిస్తున్న బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేశారు. డ్రైవర్ మహేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.